# వ్యాధులపై అప్రమత్తం

## అవగాహన కరపత్రాలు విడుదల చేసిన కమిషనర్



డెంగీ వ్యాధిపై ముద్రించిన అవగాహన గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న కమిషనర్ వినయ్‌చంద్

**తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే:** తిరుపతి నగరంలో డెంగీవ్యాధి పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని నగరపాలిక కమిషనర్ వినయ్‌చంద్ నగరపాలిక అధికారులను ఆదేశించారు. నగరపాలిక కార్యాలయంలో ఆయన ఆరోగ్య, ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. వర్షాకాలం సమీపిస్తున్నందున సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా డెంగీ వ్యాధి పట్ల జాగ్రత్తగా ఉండాలని ఆయన తెలిపారు. ప్రాణాంతకమైన డెంగీ నివారణ చర్యలు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఆయన కోరారు. ఈ విషయంలో నిర్లక్ష్యం లేకుండా ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఐదు బృందాలును ఏర్పాటు చేస్తున్నామని.. ఒక్కో బృందం 10 వార్డుల్లో పర్యటించి పరిస్థితిని అదుపుచేయాలని వివరించారు. డెంగీ వ్యాధి నివారణలో భాగంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంచాలని, వ్యాధి కారకాలను, నివారణ చర్యలపై ప్రజల్లో అవగాహన కల్పించేలా కరపత్రాలు, గోడపత్రికలు పంపిణీ చేయాలని వినయ్‌చంద్ ఆదేశించారు. డెంగీ వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు గురించి విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు. ఫాగింగ్ చేపట్టాలని చెత్తాచెదారాన్ని తొలగించడంతో పాటు కాలువలు శుభ్రం చేయాలని కొబ్బరి బొండాలు నిల్వ లేకుండా చూడాలని ఆయన సూచించారు. డెంగీ లక్షణాలు కనిపించిన వెంటనే నగరపాలిక వైద్యాధికారిణి డాక్టర్ ఉషాకుమారిని 97016 99936 నెంబరులో గాని, డీఎస్‌వో నీలకంఠం: 88978 33788, నగరపాలిక కార్యాలయం: 0877-2256766 నెంబర్లలో సంప్రదించాలని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ శ్రీదేవి, వైద్యాధికారిణి డాక్టర్ ఉషాకుమారి, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, శానిటరీ సూపర్‌వైజర్, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

### బహిరంగ మల మూత్ర విసర్జన రహిత నగరంగా తిరుపతి

**తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే:** తిరుపతి నగరాన్ని బహిరంగ మల మూత్ర విసర్జనరహిత నగరంగా ప్రకటిస్తున్నట్లు నగరపాలిక కమిషనర్ వినయ్‌చంద్ తెలిపారు. ఆక్టోబర్ 2లోపు బహిరంగ మలమూత్ర విసర్జన రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలను నగరపాలిక చేపట్టినట్లు ఆయన వివరించారు. అందులో భాగంగా అర్హులైన అందరికీ వ్యక్తిగత మరుగుదొడ్లు, మరుగుదొడ్లు లేని ప్రాంతాల్లో ప్రతి అరకిలోమీటరుకు సామాజిక మరుగుదొడ్లు, యాత్రికులు రాకపోకలు సాగించే ప్రాంతాల్లో ప్రజా మరుగుదొడ్లు అందుబాటులోకి తేస్తామన్నారు. బహిరంగ మలమూత్ర విసర్జన చేయువారి నుంచి అపరాధ రుసుము వసూలు చేయాలని ఆయన ఆదేశించారు. ఈ విషయానికి సంబంధించి ఏదైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 26 లోపు తెలపవచ్చని కమిషనర్ వినయ్‌చంద్ కోరారు.

### వీడియో సమావేశం

తిరుపతి నగరపాలిక కమిషనర్ వినయ్‌చంద్ రాష్ట్ర పురపాలికశాఖ ముఖ్య కార్యదర్శి కరికాలవళవన్ నిర్వహించిన వీడియో సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తిరుపతిలో జరుగుతున్న సుందరీకరణ పనులు, బహిరంగ మలమూత్ర విసర్జన రహితనగరంగా తీర్చిదిద్దేందుకు చేపట్టిన చర్యలు, సీజనల్ వ్యాధులు నివారణ చర్యల గురించి అడిగితెలుసుకున్నారు.